నేటి నుంచి పాఠశాలలు పునఃప్రారంభం

కలెక్టరేట్, జూన్ 12: వేసవి సెలవుల అనంతరం పాఠశాలలు గురువారం నుంచి పునఃప్రారంభం కానున్నాయి. సుమారు 45 రోజుల తరువాత విద్యార్థులు బడి బాట పట్టనున్నారు. ప్రభుత్వ పాఠశాలలకు వచ్చే విద్యార్థులకు స్టూడెంట్ కిట్లను విద్యా శాఖ పంపిణీ చేయనుంది. పాఠ్య, నోట్ పుస్తకాలతో పాటు బెల్ట్, షూ, తదితర సామగ్రి అందజేయనున్నట్లు డీఈవో ప్రేమ్‌కుమార్ తెలిపారు. జిల్లా వ్యాప్తంగా 1,28,198 మంది విద్యార్థులకు అందజేయనున్నట్లు పేర్కొన్నారు. ఒకటో తరగతి విద్యార్థులకు పిక్టోరియల్ డిక్షనరీ, 6వ తరగతి విద్యార్థులకు ఆక్స్‌ఫర్డ్ డిక్షనరీలు అందజేయనున్నారు.



ప్రమాణం చేయిస్తున్న గవర్నర్ అబ్దుల్ నజీర్, వేదికపై ప్రధాని మోదీ, చంద్రబాబు, భువనేశ్వరి



మంత్రిగా ప్రమాణస్వీకారం చేస్తున్న కొండపల్లి శ్రీనివాస్

సాఫ్ట్‌వేర్ టు మినిస్టర్

- అమెరికాలో మాస్టర్స్.. అక్కడే ఉద్యోగం
- ఐదేళ్ల క్రితం స్వదేశానికి వచ్చిన శ్రీనివాస్
- తొలిసారి గెలుపుతోనే మంత్రిగా అవకాశం

గజపతినగరం, జూన్ 12: గజపతినగరం నియోజకవర్గం నుంచి మొదటిసారిగా టీడీపీ ఎమ్మెల్యేగా గెలుపొందిన కొండపల్లి శ్రీనివాస్‌కు మంత్రివర్గంలో కూడా చోటు లభించింది. గన్నవరంలో ఏర్పాటు చేసిన ప్రమాణస్వీకార వేదికపై ఆయన మంత్రిగా బుధవారం ప్రమాణం చేశారు. రాజకీయ కుటుంబం నుంచి వచ్చిన శ్రీనివాస్‌కు అనూహ్యంగా టీడీపీ నుంచి టిక్కెట్ లభించింది. ఎన్నికల్లో ప్రత్యర్థి బొత్స అప్పలనరసయ్యపై 25,310 ఓట్ల మెజార్టీతో గెలుపొందారు. ఇదే సమయంలో ఈనియోజకవర్గం నుంచి 28 ఏళ్ల తరువాత మంత్రి పదవి దక్కించుకున్న నాయకునిగా రికార్డుకెక్కారు.

కుటుంబ నేపథ్యం..

కొండపల్లి శ్రీనివాస్ స్వగ్రామం గంట్యాడ. 1982 ఏప్రిల్ 13న కొండపల్లి కొండలరావు, సునీత దంపతులకు జన్మించారు. శ్రీనివాస్‌కు భార్య లక్ష్మీసిందూ, కుమారుడు విహన్, కుమార్తె మేధ ఉన్నారు. గ్రామీణ నేపథ్యం నుంచి వచ్చి ఉన్నత చదువులు అభ్యసించి విదేశాల్లో సాఫ్ట్‌వేర్ నిపుణులుగా పనిచేశారు. తనవృత్తిలో భాగంగా అనేక దేశాలు తిరిగి జన్మభూమికి సేవ చేయాలన్న తలంపుతో సొంత ప్రాంతానికి వచ్చేశారు. జిల్లాలో రోటరీ క్లబ్ కార్యదర్శిగా బాధ్యతలు నిర్వహించిన ఆయన అనేక రక్తదాన శిబిరాలు ఏర్పాటు చేశారు. గజపతినగరం నియోజకవర్గంలో ఆర్వో ప్లాంట్‌కు నిధులు సమకూర్చడంతో పాటు జిల్లాలోని గ్రామీణ ప్రాంతాల్లో ఆధ్యాత్మిక, క్రీడా సాంస్కృతిక, సేవా కార్యక్రమాలకు ఆర్థిక సహాయం అందజేస్తూ గ్రామాల వికాసానికి కృషి చేస్తూ వస్తున్నారు.

సాఫ్ట్‌వేర్ రంగం నుంచి..

శ్రీనివాస్ ప్రాథమిక విద్యాభ్యాసం విజయనగరం, అరకు ప్రాంతాల్లోని సెయింట్ జోసఫ్ స్కూలులో సాగింది. ఇంటర్ విశాఖలోని విజ్ఞాన్‌లో చదివారు. జీఎంఆర్ ఇంజనీరింగ్ కళాశాలలో బీటెక్ కంప్యూటర్ పూర్తి చేశారు. ఉన్నత విద్య కోసం అమెరికా వెళ్లి కంప్యూటర్ సైన్స్‌లో మాస్టర్ డిగ్రీ చేశారు. అనంతరం అమెరికాలోని ఒరాకిల్ సంస్థలో ఈఆర్‌పీ సొల్యూషన్స్ విభాగంలో సుదీర్ఘకాలం సాఫ్ట్‌వేర్ నిపుణుడిగా బాధ్యతలు నిర్వహించారు. ఐదేళ్ల క్రితం తిరిగి స్వదేశానికి వచ్చారు. రియల్ ఎస్టేట్, కనస్ట్రక్షన్ ఫీల్డ్‌లో ఉన్నారు. ఎన్నికలకు మూడు నెలలకు ముందు వైసీపీ నుంచి టీడీపీలో చేరారు. మాజీ ఎమ్మెల్యే కేఏ నాయుడు ఈయన చిన్నాన్న.

రాజకీయ నేపథ్యం..

తెలుగుదేశం పార్టీ ఆవిర్భావం నుంచి కొండపల్లి కుటుంబం పార్టీలోనే ఉంది. మూడుతరాల రాజకీయ నేపథ్యం కలిగి ఉంది. శ్రీనివాస్ మూడో తరం వారసుడిగా ఉన్నారు. మొదటిసారిగా ఎమ్మెల్యేగా పోటీచేయడమే కాకుండా విజేతగా నిలిచారు. అంతలోనే మంత్రి పదవిని కూడా పొందారు. శ్రీనివాస్ తాతయ్య కొండపల్లి పైడితల్లి నాయుడు ఉమ్మడి జిల్లాలో బొబ్బిలి పార్లమెంట్ సభ్యునిగా 11వ, 12వ, 14వ లోక్‌సభకు ప్రాతినిధ్యం వహించారు. అలాగే జిల్లా పరిషత్ ఛైర్మన్‌గా, తెలుగుదేశం పార్టీ జిల్లా అధ్యక్షునిగా సేవలు అందించారు. శ్రీనివాస్ తండ్రి కొండలరావు గంట్యాడ మండల ఎంపీపీగా పనిచేశారు. తల్లి తరుపున తాతయ్య అప్పికొండ సత్యంనాయుడు 1962-82మధ్యకాలంలో సాలూరు సమితి అధ్యక్షులుగా సేవలు అందించారు. బాబాయి కొండపల్లి అప్పలనాయుడు గజపతినగరం నియోజకవర్గం ఎమ్మెల్యేగా 2014-19లో పనిచేశారు.

28ఏళ్ల తర్వాత మంత్రి పదవి

గజపతినగరం నియోజకవర్గం 1955లో ఏర్పడింది. తెలుగుదేశం పార్టీ ఆవిర్భావం తర్వాత 1983లో జరిగిన ఎన్నికల్లో జంపన సత్యన్నారాయణరాజు ఎమ్మెల్యే అయ్యారు. ఆయన మరణానంతరం బొండపల్లి ఎంపీపీగా ఉన్న పడాల అరుణకు అవకాశం రావడంతో 1989, 1994, 2004లో ఎమ్మెల్యేగా గెలుపొంది నప్పటికీ 1996లో రాష్ట్ర శిశు సంక్షేమ సాంస్కృతిక వ్యవహారాలశాఖ మంత్రిగా పదవి వరించింది. 2009, 2019లో రెండుపర్యాయాలు బొత్స అప్పలనరసయ్య, 2014లో కొండపల్లి అప్పలనాయుడు ఎమ్మెల్యే అయ్యారు. వీరిలో ఏఒక్కరికీ మంత్రి పదవి రాలేదు. ఈ ఎన్నికల్లో గెలిచిన శ్రీనివాస్ మంత్రి అయ్యారు. ఈ లెక్కన నియోజకవర్గంలో 28 ఏళ్ల తరువాత ఎమ్మెల్యేకు మంత్రి పదవి దక్కింది.



ఎన్‌సీఎస్ థియేటర్‌లో ప్రత్యక్ష ప్రసారం

కలెక్టర్ సమక్షంలో ప్రత్యక్ష వీక్షణం



సీఎం, మంత్రుల ప్రమాణస్వీకార కార్యక్రమాన్ని జిల్లా యంత్రాంగం ప్రత్యక్ష ప్రసారం చేసింది. కలెక్టరేట్ ఆడిటోరియంలో భారీ స్క్రీన్ ఏర్పాటు చేశారు. ప్రధాని నరేంద్ర మోదీ, ఇతర ప్రముఖులు, కేంద్ర మంత్రులు, కేంద్ర రాష్ట్ర ఉన్నతాధికారుల సమక్షంలో నూతన ముఖ్యమంత్రిగా చంద్రబాబు నాయుడు, ఇతర మంత్రివర్గ సహచరుల చేత రాష్ట్ర గవర్నర్ అబ్దుల్ నజీర్ ప్రమాణం చేయించారు. మున్సిపల్, మండల కేంద్రాల్లోనూ ప్రత్యక్ష ప్రసారం చేశారు. కలెక్టరేట్‌లో కలెక్టర్ నాగలక్ష్మి, డీఆర్వో అనిత తదితరులు పాల్గొన్నారు.

-కలెక్టరేట్

ప్రత్యక్ష ప్రసారంలో కలెక్టర్ నాగలక్ష్మి



- హేమాహేమీలకు దక్కని అవకాశం
- 2014 పునరావృతం

యువతకే ప్రాధాన్యం



(విజయనగరం-ఆంధ్రజ్యోతి)

మంత్రివర్గంలో ఈసారి యువతకు ప్రాధాన్యం ఇచ్చారు. కొత్తవారిని ప్రోత్సహించడంతో పాటు యువత అయితే అభివృద్ధిని మరింత వేగంగా తీసుకువెళ్లగలరని చంద్రబాబు భావించినట్లుంది. ఈ విషయాన్ని ఊహించని సీనియర్లు తమకు పదవి వస్తుందని ఆశపడ్డారు. తర్వాత పేరు లేకపోవడంతో కాస్త నిరాశ పడ్డారు. అయితే అధినేత ఏం చేసినా ముందుచూపుతో చేస్తారన్న అభిప్రాయానికి వచ్చారు. యువతకు ప్రాధాన్యం ఇచ్చిన నేపథ్యంలో గజపతినగరం ఎమ్మెల్యేగా మొదటిసారి ఎన్నికైన యువనాయకుడు కొండపల్లి శ్రీనివాస్‌కు రాష్ట్ర మంత్రివర్గంలో బెర్త్ లభించింది. ఇదే సమయంలో సీనియర్లపై చర్చ నడిచింది.

- మూడు పర్యాయాలు సునాయసంగా ఎస్.కోట నుంచి గెలుపొందిన కోళ్ల లలితకుమారి ఈసారి మంత్రి పదవి ఆశించారు. కిమిడి కళావెంకట్రావు ఎన్‌టీఆర్ మంత్రివర్గం నుంచి మంత్రిగా పనిచేస్తూ వచ్చారు. అది కూడా హోం శాఖ వంటి కీలక శాఖలను సైతం చేపట్టారు. 2014లో మంత్రి వర్గ విస్తరణలో భాగంగా కళావెంకట్రావుకు ఎనర్జీ(విద్యుత్) శాఖ మంత్రి పదవి దక్కింది. టీడీపీ రాష్ట్ర అధ్యక్షునిగా పనిచేసిన అనుభవం ఉంది. ప్రస్తుతం పొలిట్ బ్యూరో సభ్యులుగా ఉన్నారు. వీటన్నింటినీ దృష్టిలో పెట్టుకుని కళాకు మంత్రి పదవి దక్కుతుందని ఆయన అనుచరులు, జిల్లా ప్రజలు చర్చించుకున్నారు.
- కాంగ్రెస్ ప్రభుత్వం నుంచి కోండ్రు మురళీమోహన్ మంత్రిగా పనిచేసిన అనుభవం ఉంది. ఎస్సీ కేటగిరిలో అయినా మంత్రి పదవి దక్కుతుందని భావించారు. ఆశ నెరవేరలేదు. బొబ్బిలి ఎమ్మెల్యేగా మొదటిసారి గెలుపొందిన బేబీనాయనకు మంత్రి పదవి ఇస్తారని బొబ్బిలి ప్రాంత ప్రజలు ఆశించారు. సామాజిక మాధ్యమాల్లో బేబీనాయనకు మంత్రి పదవి అంటూ మంగళవారం చక్కర్లు కొట్టింది. అటవీ, శాస్త్ర సాంకేతిక శాఖలను అప్పగించినట్లు కూడా ఫేక్ న్యూస్ చక్కర్లు కొట్టింది.

ఉమ్మడి జిల్లాలో..

2014 ఎన్నికల్లో టీడీపీ ప్రభుత్వం ఏర్పాటైనపుడు కూడా కళావెంకట్రావుకు మంత్రి పదవి దక్కలేదు. అప్పట్లో చీపురుపల్లి ఎమ్మెల్యేగా గెలుపొందిన కిమిడి మృణాళినికి మంత్రి పదవి దక్కింది. మూడేళ్ల తరువాత మంత్రి వర్గ విస్తరణలో భాగంగా మృణాళినిని తప్పించారు. కళావెంకట్రావుకు విద్యుత్ శాఖ మంత్రి పదవిని అందించారు. 2014లో జరిగిన మాదిరిగానే ఈ సారి కూడా కళాకు మంత్రి పదవి దక్కలేదు. ఇతర కీలక పదవి ఏదైనా దక్కవచ్చునేమో.

సైబర్ నేరాలపై చర్యలేవి?



- చేతులెత్తేస్తున్న బ్యాంకుల అధికారులు
- కేసు నమోదుకే పోలీసుల పరిమితం
- లబోదిబోమంటున్న ఖాతాదారులు



రాజాం రూరల్, జూన్ 12: సైబర్ నేరాలపై చర్యలుండవా... తెలిసో తెలియకో పని ఒత్తిడిలోనో బ్యాంకులకు సంబంధించిన సమాచారం ఇస్తే ఖాతాదారులు నష్టపోవాల్సిందేనా.. బ్యాంకుల నుంచి ఎలాంటి భరోసా ఉండదా.. పోలీసులు కేసు నమోదు చేసి ఊరుకుంటారా.. ఉన్నతాధికారులు స్పందించరా.. ఇలా అయితే ఖాతాల్లో ఎవరూ నగదు ఉంచరు కదా... ఇవీ సైబర్ మోసాలపై జిల్లా అంతటా జరుగుతున్న చర్చ.. కొంతకాలంగా జిల్లాలో సైబర్ నేరాలు పెరిగాయి. ఏటీఎం నుంచి డబ్బులు మాయం చేయడం.. బయోమెట్రిక్ ఆధారంగా ఖాతా నుంచి డబ్బులు దోచేయడం... సెల్‌కు లింక్ పంపి మెల్లగా కాజేయడం లాంటి ఘటనలు తరచూ జరుగుతున్నాయి. నానాటికీ బాధితులు పెరుగుతున్నారు తప్పితే వాటి నుంచి బయటపడిన వారు చాలా అరుదుగా ఉంటున్నారు.

బ్యాంకు కన్నా ఇల్లే పదిలమా?

కొద్దిరోజులుగా చోటుచేసుకుంటున్న పరిణామాలు, గతంలో బ్యాంకులు విధించిన కఠిన నిర్ణయాల నేపథ్యంలో చాలా మందికి బ్యాంకు కన్నా ఇల్లే పదిలమనిపిస్తోంది. కష్టార్జితంలో కొంత మొత్తాన్ని బ్యాంకులో దాచుకునే ఖాతాదారులకు ఆర్థిక భరోసా ఉండడం లేదు. సైబర్ నేరగాళ్ల పన్నాగంతో అనేక మంది ఖాతాదారులు ఆర్థికంగా నష్టపోతున్నారు. జీవిత చరమాంకంలో పనికొస్తుందని కొందరు, బయట వ్యక్తులకు అప్పుగానో, వడ్డీరూపంలోనో ఇస్తే అత్యవసర పరిస్థితుల్లో ఉపయోగపడదని బ్యాంకుల్లో దాచుకుంటే అక్కడా భద్రత కరువు అవుతోంది. బ్యాంకులో ఉంచిన నిల్వలపై ఆదాయం పెద్దగా రాకపోయినా భరోసా ఉంటుందని ఆశిస్తే మొదటికే మోసం వస్తోందని ఖాతాదారులు వాపోతున్నారు.

ఏవీ చర్యలు

రాజాంలోని ఇటీవల ఓ దేవాలయ పూజారి పని ఒత్తిడిలో ఓటీపీ చెప్పడంతో క్షణాల్లో అతని ఖాతా నుంచి రూ.1.21 లక్షలు మాయమయ్యాయి. గతంలో సైబర్ నేరగాళ్ల ఉచ్చులో పడి రాజాంకు చెందిన డా. చంద్రశేఖర్ నాయుడు, అతని భార్య ఖాతాల నుంచి రూ. 1.24 లక్షలు కట్ అయ్యాయి. ఈ సంఘటన జరిగిన రెండు వారాల విరామంలో పట్టణంలోని కుమ్మరి వీధికి చెందిన విశ్రాంత ఉద్యోగి అప్పలకొండమ్మ ఖాతా నుంచి రూ. రూ. 60 వేలు పోయాయి. పట్టణంలోని ఎస్సీ కాలనీకి చెందిన ఓ మహిళ అకౌంట్ నుంచి రూ.60 వేలు, సంతకవిటి మండలానికి చెందిన మరో మహిళ రాజాం ఏటీఎం వద్ద రూ.39 వేలు పోగొట్టుకున్నారు. వీరంతా సైబర్ నేరగాళ్ల తెలివికి బలైపోయారు. అలాగే రాజాంకు చెంది విశాఖలో ఉంటున్న ఓ మాజీ ఆర్మీ అధికారి డా. సుధామోహన్ ఖాతా నుంచి ఇటీవల రూ.30 వేలు మాయం అయ్యాయి. ఈ సంఘటన జరిగిన రెండ్రోజుల్లోనే అతని ఖాతా నుంచి రెండోసారి రూ.24 వేలు మాయం చేశారు. రాజాంలో ఉంటున్న ఓ ఇంజనీరింగ్ విద్యార్థి, అతని సోదరి ఖాతాల నుంచి రూ.2.38 లక్షలు మాయం అయ్యాయి.

అధికారులు ఏమంటున్నారంటే..

సైబర్ నేరగాళ్ల చేతిలో మోసపోతే బ్యాంకుల పరంగా చేసేదేమీ లేదని బ్యాంకుల మేనేజర్లు చెబుతున్నారు. అపరిచితులు ఫోన్‌చేసి బ్యాంకులకు సంబంధించిన సమాచారం అడిగితే చెప్పవద్దని ఖాతాదారులకు స్పష్టం చేస్తున్నామంటున్నారు. కాగా పోలీస్ అధికారులు సైతం ఇదే విషయాన్ని వెల్లడిస్తున్నారు. కేసు నమోదు చేసి ఉన్నతాధికారులకు నివేదించడం మినహా తాము చేయగలిగిందేమీ లేదంటున్నారు. రాష్ట్ర, రాష్ట్రేతర ప్రాంతాలే కాకుండా ఇతర దేశాల నుంచి ఆన్‌లైన్‌లో చేసిన మోసాలకు పరిష్కారం తక్కువని పోలీసులు స్పష్టం చేస్తున్నారు.

విద్యార్థులందరికీ పుస్తకాలు అందజేయాలి

ఆర్జేడీ విజయభాస్కర్

భోగాపురం/ పూసపాటిరేగ, జూన్12: ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులందరికీ పాఠ్యపుస్తకాలు అందజేయాలని ఆర్జేడీ బి.విజయభాస్కర్ విద్యాశాఖ అధికారు లకు సూచించారు. భోగాపురం ఏపీ మోడల్‌స్కూల్‌లోని పాఠ్యపుస్తకాలు, నోట్ పుస్తకాల స్టాక్ గదిని బుధవారం ఆయన ఆకస్మికంగా సందర్శించారు. ఈసందర్భంగా గదిలో ఉన్న పాఠ్యపుస్తకాలను పరిశీలించారు. ఎన్ని స్కూల్స్ ఉన్నాయి, ఎంత మంది విద్యార్థులు ఉన్నారు, ఎన్ని పుస్తకాలు వచ్చాయి, పుస్తకాలు ఆయా స్కూల్స్‌కు సరఫరా చేశారా అని అడిగి తెలుసుకొన్నారు. ఆయన వెంట డీఈవో ఎన్.ప్రేమ్‌కుమార్, ఎంఈవోలు రమణమూర్తి, చంద్రమౌళి, ఎంఐఎస్ సూర్యనారాయణ ఉన్నారు.



పాఠ్య పుస్తకాలను పరిశీలిస్తున్న ఆర్జేడీ విజయభాస్కర్

- పూసపాటిరేగ జిల్లాపరిషత్ పాఠశాలను కూడా బుధవారం విద్యాశాఖ జాయింట్ డైరెక్టర్ బి.విజయ భాస్కర్ సందర్శించారు. స్టాక్ పాయింట్‌లో పుస్తకాలను అమర్చే విధానాన్ని పరిశీలించారు. రికార్డులపై ఆరా తీశారు.

పేరు గొప్పే

జేఎన్‌టీయూలో మౌలిక సౌకర్యాలు మృగ్యం



జేఎన్‌టీయూ ఇండోర్ స్టేడియం రేకులు ఎగిరిపోయిన దృశ్యం

జిల్లాకు తలమానికంగా ఉన్న జెఎన్‌టీయూ ఇంజనీరింగ్ కళాశాల గురజాడ విశ్వ విద్యాలయంగా మార్పు చేశాక కూడా అభివృద్ధి లేదు. విద్యార్థులకు కనీస సౌకర్యాలు కల్పించడం లేదు. అక్కడి పరిస్థితులకు విసిగి కొద్ది నెలల కిందట విద్యార్థులు పెద్ద ఎత్తున నిరసన తెలిపారు. ప్రధాన గేటు వద్ద బైఠాయించి ఆందోళన చేశారు. వీసీ వచ్చి హామీలు ఇచ్చి నిరసనను విరమింపజేశారు. హామీలను మాత్రం నెరవేర్చలేదు. కూలిపోయిన ఇండోర్ స్టేడియం అలాగే ఉంది. పైకప్పు ధ్వంసమై కనిపిస్తోంది. మరుగుదొడ్లను బాగు చేయడం లేదు. నిర్వహణ చాలా అధ్వానంగా ఉంది. స్నానపు గదుల డోర్లు కూడా సరిగా లేవు.

- (విజయనగరం-ఆంధ్రజ్యోతి)

ఊదరగొట్టారు.. ఉసూరుమనిపించారు

- సంగాం, వంగర, అరసాడలో అటకెక్కిన ఇళ్ల నిర్మాణం
- కూటమి ప్రభుత్వంపైనే లబ్ధిదారుల ఆశలు

వంగర: మండలంలో సంగాం, వంగర, అరసాడలో ఇళ్ల నిర్మాణాలపై వైసీపీ ప్రభుత్వం ఊదర గొట్టి, ఉసూరు మనిపించింది. తాము కట్టించేవి ఇళ్లు కాదు.... ఊళ్లంటూ వైసీపీనాయకులు ఆర్భాట ప్రకటనలతో ప్రజలను ఉదరగొట్టారు. వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఆ పార్టీ నాయకులతోపాటు ముఖ్య మంత్రి జగన్ మోహన్ రెడ్డి ప్రతి సమావేశంలోనూ స్థలాలిస్తున్నాం, ఇళ్లు కట్టిస్తామని చేసిన ప్రకటనలు అటకెక్కాయి. ఇళ్ల నిర్మాణాలు పూర్తిచేసి కాలనీలుగా మారుస్తామని పేర్కొన్నా, చివరికి ఇళ్లు కట్టించకుండా ఉసూరు మని పించారు. మండలంలోని మూడు చోట్ల కాలనీ లకు స్థలం సేకరించినట్లు చెప్పిన నాయకులు ఎక్కడా నిర్మాణాలు జరగలేదు. అరసాడలో స్థలం వివాదంలో ఉండగా కోర్టును పలువురు ఆశ్రయించారు. ఇక్కడ 90 ఇళ్లకు గాను రెండిళ్లు మాత్రమే పూర్తయ్యాయి. వంగరలో 53 ఇళ్లకు గాను ఒక్కటీ ప్రారంభించలేదు. సంగాంలో భూమి కొనుగోలు చేసినట్లు చెపుతున్నా ఆ భూమి యజమాని ఎవరు తెలియని పరిస్థితి నెలకొంది. ఈ నేపథ్యంలో అక్కడ కూడా నిర్మాణాలు జరగలేదు. చివరికి జగనన్న కాలనీ లకు కేటాయించిన స్థలాలు శ్మశానవా టికలు తలపించేలా కనిపిస్తున్నాయని పలువురు విమర్శిస్తున్నారు. ఈ నేపథ్యంలో రాష్ట్రంలో కూట మి ప్రభుత్వం ఏర్పడడంతో కొత్తగా ఇళ్లు మంజూరవుతాయని ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.



సంగాంలోని జగన్ కాలనీలో అర్ధాంతరంగా నిలిచిన ఇళ్లు

రద్దీ పెరిగింది.. అధ్వానంగా మారింది

- పదేళ్లు పట్టించుకోని అప్పటి ఎమ్మెల్యే కంబాల జోగులు
- ప్రస్తుతం కోండ్రుపైనే ఆశలు
- పూర్తయితే రాజాంలో తగ్గనున్న ట్రాఫిక్
- ఇదీ కొండంపేట-బుచ్చెంపేట రహదారి పరిస్థితి

- కేవలం రెండు కిలోమీటర్ల రహదారికి మరమ్మతులు చేయిస్తే వందలాది మంది రాజాం పట్టణంలోనికి రాకుండా, ట్రాఫిక్‌లో చిక్కుకోకుండా, పాలకొండ రోడ్డులో ప్రమాదాల బారిన పడకుండా గమ్యస్థానాన్ని చేరుకోవచ్చు. అయినాసరే ఆ మార్గాన్ని కనీసం మరమ్మతు చేయించే దిశగా అధికారులు ఆలోచించడం లేదని వాహనచోదకులు, ప్రయాణికులు వాపోతున్నారు.

- రాజాం ఎమ్మెల్యేగా ప్రాతినిధ్యం వహించిన కంబాల జోగుల ఈ రోడ్డు వైపు కన్నెత్తి చూడలేదు. ఈ రోడ్డును పూర్తిస్థాయిలో మరమ్మతులు చేయాలని అధికారులతో పాటు రాజాం ఎమ్మెల్యే కంబాల జోగులుకు పలువురు అందజేసిన వినతిపత్రాలు బుట్టదాఖలయ్యాయి. దీంతో వందలాది మంది విద్యార్థులు, ఉద్యోగులు, రోగులు, వాహన చోదకులు గోతుల మార్గంలో ప్రయాణిస్తూ అవస్థలకు గురవుతున్నారు.

(రాజాం రూరల్)

రాజాం మునిసిపాలిటీ పరిధిలోని కొండంపేట-బుచ్చెంపేట మధ్య కేవలం రెండు కిలోమీటర్ల రహదారి పూర్తిగా దెబ్బతింది. ఈ రోడ్డుపై రద్దీ పెరగడంతోపాటు అధ్వానంగా మారడంతో వాహనచోదకులు, ప్రజలకు అగచాట్లు తప్పడం లేదు. వైసీపీ తరపున పదేళ్లుగా ఎమ్మెల్యే కంబాల జోగులు ఎమ్మెల్యేగా ప్రాతినిధ్యం వహించినా రోడ్డు దుస్థితిని పట్టించుకోలేదని పలువురు చోదకులు చెబుతున్నారు. టీడీపీ ప్రభుత్వం హయాంలో వీర్రాజు చెరువు గట్టును వెడల్పు చేసి, గ్రావెల్ వేయడంతో వాహనాల రాకపోకలకు వెసులుబాటు కలిగింది. ఈమార్గాన్ని బీటీ రోడ్డుగా మార్చే ప్రతిపాదన అప్పట్లో ఉన్నా, 2019లో రాష్ట్రంలో ప్రభుత్వం మారడం, రాజాంలో అధికార పార్టీ అభ్యర్థి కంబాల జోగులు ఎమ్మెల్యేగా గెలుపొందడంతో బీటీ రోడ్డు ప్రతిపాదన తెరమరుగైంది. ఈ నేపథ్యంలో రద్దీ పెరగడంతో కాలక్రమంలో ఈ రహదారి మరింత అధ్వానంగా తయారైంది. అత్యవసర పరిస్థితుల్లో రాకపోకలు సాగించే వారంతా తీవ్ర అవస్థలకు గురవుతున్నారు. పలువురు ప్రమాదాల బారిన పడుతున్నారు. ఈ రోడ్డు పూర్తయితే రాజాం పట్టణంలో ట్రాఫిక్ తగ్గుతుంది.

సమయం ఆదా..

కొండంపేట నుంచి బుచ్చెంపేట వరకూ వీర్రాజుచెరువు గట్టును అభివృద్ధి చేస్తే వందలాది మందికి సమయం ఆదాతో పాటు ఎంతో ప్రయోజనం కలగనుంది. జీఎంఆర్‌నగర్‌లోని కేర్ హాస్పిటల్‌కు వెళ్లాల్సిన రోగులతో పాటు ఎల్‌కేజీ టూ పీజీ వరకు పలు విద్యాసంస్థలకు రాకపోకలు సాగించే విద్యార్థులకు మేలు కలగనుంది. వీరితోపాటు రేగిడి, వంగర, సంతకవిటి, పాలకొండ తదితర మండలాల్లో పనిచేసే ఉద్యోగులు ఈ మార్గం గుండానే రాకపోకలు సాగిస్తున్నారు. ఈ రహదారిలో రాకపోకలు సాగించే వందలాది మంది రాజాం పట్టణంలోనికి రాకుండా, ట్రాఫిక్ చిక్కుల్లో పడకుండా తమ తమ గమ్యస్థానాలకు వెళ్లేందుకు వీలుంది. ఇలా రాకపోకలు సాగించేవారికి కనీసం ఐదు కిలోమీటర్ల మేర దూరం తగ్గుతుంది. దీంతో రాజాంతోపాటు తెర్లాం, మెరకముడిదాం మండలాలకు చెందిన వారు సైతం ఆయా విద్యా సంస్థలకు వెళ్లడానికి, హాస్పిటళ్లు, ఉద్యోగ అవసరాలకోసం ఈ మార్గాన్నే ఆశ్రయిస్తున్నారు. ఇంత ప్రాధాన్యం ఉన్నా ఆ మార్గం అభివృద్ధిపై అధికారులు, నేతలు శ్రద్ధ కనబరచకపోవడంపై విమర్శలు వినిపిస్తున్నాయి.

వినతులు బుట్టదాఖలు..

రాజాం శాసనసభ్యుడిగా విజయం సాధించిన కోండ్రు మురళీపైనే ఈ ప్రాంతీయులంతా ఆశలు పెట్టుకున్నారు. 2009-14లో ఐదేళ్ల పాటు నియోజకవర్గంలో కోట్లాది రూపాయలు వెచ్చించి అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టిన విషయం విదితమే. ఈ నేపథ్యంలో కోండ్రుకు ఎన్నికల ప్రచారంలో కొండంపేట-బుచ్చెంపేట మధ్య రహదారి విస్తరణ సమస్యను వివరించారు. తాను ఈ రోడ్డు పూర్తిచేస్తానని ఆయన హామీ కూడా ఇచ్చారు. దీంతో మురళీతోనే రహదారి విస్తరణ సాధ్యమని చుట్టుపక్కల గ్రామాల ప్రజలు ఆశాభావాన్ని వ్యక్తం చేస్తున్నారు. ఈ రోడ్డు గురించి గతంలో రాజాం కమిషనర్‌తో పాటు ఎమ్మెల్యేకు అందజేసిన వినతిపత్రాలు బుట్టదాఖలయ్యాయి.



అధ్వానంగా మారిన కొండంపేట-బుచ్చెంపేట మధ్య రహదారి

పర్యవేక్షణ లేక.. ప్రసవాలకు నోచుకోక

- పట్టణ ప్రాంతాలకు రిఫర్ చేస్తున్న వైద్యులు
- ఇదీ వంగర, అరసాడ పీహెచ్‌సీల్లో పరిస్థితి

వంగర: వంగర, అరసాడ పీహెచ్‌సీల్లో గర్భిణులు ప్రసవాలకు నోచుకోవడంలేదు. ఇక్కడ ఉన్నతాధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో గర్భిణులను రాజాం తదితర పట్టణ ప్రాంతాల్లోని ప్రైవేటు ఆస్పత్రులకు ప్రసవాలకోసం రిఫర్ చేస్తున్నారు. ఈ రెండు పీహెచ్‌సీల్లో సరిపడా వైద్యులు ఉన్నా నెలవారి ప్రసవాల లక్ష్యం అటకెక్కి స్తున్నారని ఆరోపణలొస్తున్నాయి.

సాధారణ కాన్పులు చేయక..

వంగర, అరసాడ పీహెచ్‌సీల్లో కార్పొరేట్‌కు దీటుగావైద్య సేవలం దిస్తున్నామని వైసీపీ పాలకుల ప్రకటనలు అటకెక్కాయి. గతఏడాది ఏప్రిల్ నుంచి ఈ ఏడాది జూన్ వరకు వంగర, అరసాడ పీహెచ్‌సీల్లో ఒక్క కుటుంబ నియంత్రణ ఆపరేషన్, కనీసం ఒక్క సాధారణ కాన్పు చేయకపోవడం విశేషం. గతంలో ఇక్కడ ప్రసవాలు నెలకు 20 వరకూ జరిగేవి. గత రెండేళ్లుగా రిఫర్‌చేస్తుండడంతో పేద కుటుంబాలు ఆర్థికంగా ఇబ్బందిపడుతున్నాయి. ఈ రెండు పీహెచ్‌సీలకు వచ్చే గర్భిణులకు సాధారణ పరీక్షలు నిర్వహించిన వైద్యులు పరిస్థితి విషమంగా ఉందని చెప్పి రాజాం తదితర పట్టణాల్లో ఆస్పత్రులకు రిఫర్‌చేస్తున్నారు.

గర్భిణులకు వ్యయ ప్రయాసలు

గర్భిణులకు అంగన్‌వాడీ కేంద్రాల్లో పౌష్టికాహారం అందజేయడంతోపాటు ఆరోగ్య సిబ్బంది తరచూ పరీక్షలు నిర్వహించి, వారి వివరాలు ఎప్పటికప్పుడు ఆన్‌లైన్‌లో నమోదు చేయాలి. గర్భిణి ఆరోగ్య పరిస్థితి గమనించి పీహెచ్‌సీల్లో చేర్పించి ప్రసవాలు జరిగేలా అధికారులు చర్యలు తీసుకోవల్సిఉంది. ఈ రెండు కేంద్రాల్లో పనిచేసే సిబ్బంది ఎవరికి వారే యమునాతీరే అన్న చందంగా వ్యవహరిస్తుం డడంతో గర్భిణులు వ్యయప్రయాసలకు గురికావాల్సివస్తోంది



వంగర పీహెచ్‌సీ

ప్రైవేటు ఆసుపత్రులతో కుమ్మక్కు..

వంగర, అరసాడ పీహెచ్‌సీల్లో గర్భిణులకు వైద్యపరీక్షలు చేయకపోవడంతో ప్రైవేటు వాహనాల్లో పట్టణ ప్రాంతాల్లోని గల ప్రైవేటు వైద్యశాలలకు తరలించాల్సి వస్తోంది.ప్రైవేటు ఆసుపత్రుల్లో గర్భిణులకు చేర్పిస్తే ప్రసవం అనంతరం తల్లీ బిడ్డలు డిశ్చార్జ్ అయ్యే వరకూ కుటుంబ సభ్యులు ఉండాల్సి రావడంతో రోజుకు రూ.2 వేల ఐదు వందలు వరకు, నాలుగైదు రోజులకు రూ.15 వేలు వరకు ఖర్చవుతుంది. ఆరోగ్యశ్రీ వర్తించని వారికి ఆర్థికంగా భారమవుతోంది. కొందరు పీహెచ్‌సీల సిబ్బంది ప్రైవేటు ఆసుపత్రుల సిబ్బందితో కుమ్మక్కై. సాధారణంగా ప్రసవం కావల్సిన వారిని కూడా ప్రైవేటు ఆసుపత్రులకు తరలిస్తున్నారని ఎప్పటి నుంచో విమర్శలొస్తున్నాయి.

నెలకు పది చేయాల్సి ఉన్నా..

ప్రతి పీహెచ్‌సీలో నెలకు కనీసం పది వరకూ కాన్పులు కచ్చితంగా చేయాల్సి ఉంది. అయితే ఈ రెండు పీహెచ్‌సీల్లో ఏనాడూ లక్ష్యం చేరుకోని పరిస్థితి నెల కొంది. ఇక్కడ ప్రసవాలు చేయడానికి అన్ని సౌకర్యాలు ఉన్నా, సిబ్బంది విని యోగించడంలేదు. ప్రధానంగా వైద్యులు కాన్పులు చేయడానికి ఆసక్తి చూప డంలేదు. ప్రైవేటు ఆసుపత్రులతో కుమ్మక్కు కావడం వల్లే ఈ పరిస్థితి నెలకొందని పలు గ్రామాల గర్భిణుల బంధువులు ఆరోపిస్తున్నారు. కొందరు వైద్యులు పీహెచ్‌సీలో మధ్యాహ్నం వరకు ఓపీ చూసి అనంతరం చేతులు దులుపుకొని ఇళ్లకు వెళ్లిపోతున్నారన్న విమర్శలు సర్వత్రా వినిపిస్తున్నాయి.

జూనియర్ వైద్యులు కావడంతోనే..

వంగర, అరసాడ పీహెచ్‌సీల్లో జూనియర్ వైద్యులు ఉండడంతో ప్రసవాలు, కుటుంబ నియంత్రణ ఆపరేషన్లు చేయడంలేదని వంగర సీహెచ్‌వో రామారావు తెలిపారు. గతంలో పక్క మండలాలకు చెందిన సీనియర్ వైద్యులు వచ్చి ప్రసవాలు చేసేవారని చెప్పారు. ప్రస్తుతం వారు రాకపోవడంతోపాటు ఇక్కడ కొన్ని ఇబ్బందులు ఉన్నాయని తెలిపారు. సిబ్బంది ప్రైవేటు వైద్యశాలలతో కుమ్మక్కు వుతున్నారన్న విషయంపై దృష్టిసారిస్తామని, రుజువైతే చర్యలు తీసుకుంటామని చెప్పారు.

రహదారికి మరమ్మతులు చేయరూ!

భోగాపురం: సుందరపేట సమీపంలో విశాఖ నుంచి శ్రీకాకుళం వైపు వెళ్లే జాతీయ రహదారికి సంబంధించిన సర్వీసు రహదారిలో పగుళ్లు ఏర్పడ్డాయి. దీంతో వాహన చోదకులు ఇబ్బందులకు గురవుతున్నారు. రహదారిలో పగుళ్లు ఏర్పడడంతో టైర్లు అందులో పడి వాహనాలు అదుపు తప్పుతున్నాయని, వాహనాలు మరమ్మతులకు గురవుతున్నాయని వాహన చోదకులు వాపోతున్నారు. ఇప్పటికైనా రహదారికి మరమ్మతులు చేపట్టాలని వాహన చోదకులు కోరుతున్నారు.



బీటలువారిన రహదారి

పీడీఎస్ బియ్యం స్వాధీనం

గంట్యాడ: పెదవేమలి గ్రామం నుంచి చంద్రంపేట రైసు మిల్లుకు వెళ్లిన పీడీఎస్ బియ్యాన్ని సివిల్ సప్లయిస్ అధికారులు బుధవారం పట్టుకున్నారు. దీనికి సంబందించి సీఎస్ డీటీ జయలక్ష్మి అందించిన వివరాలు ఇలా ఉన్నాయి. పెదవేమలి గ్రామం నుంచి ఆటోలో గ్రామానికి చెందిన ఎల్లాజీ అనే వ్యక్తి చంద్రంపేట రైస్ మిల్లుకు అక్రమంగా పీడీఎస్ బియ్యం తరలించారు. దీనిపై అందిన సమాచారంతో మిల్లుకు వెళ్లి పరిశీలించగా 2,310 కేజీల పీడీఎస్ బియ్యం ఉన్నట్లు గుర్తించారు. వెంటనే ఆ బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. బియ్యం తరలించిన వ్యక్తితో పాటు, మిల్లు యజమానిపె 6 ఏ కేసు నమోదు చేసినట్లు సీఎస్‌డీటీ తెలిపారు.



స్వాధీనం చేసుకున్న పీడీఎస్ బియ్యం

కాలువల్లో వ్యర్థాలు వేస్తే జరిమానా

- విజయనగరం నగర పాలక సంస్థ కమిషనర్ మల్లయ్యనాయుడు

విజయనగరం రింగురోడ్డు: పాలిథిన్ కవర్లు, దుకాణాల్లో వ్యర్థాలను కాలువల్లో వేస్తున్నట్లు గుర్తించామని, అటువంటి చర్యలు మానుకోకపోతే జరిమానాలు తప్పవని నగర పాలక సంస్థ కమిషనర్ ఎం. మల్లయ్యనాయుడు హెచ్చరించారు. బుధవారం విజయనగరంలోని వివిధ ప్రాంతాల్లో పూడికతీత పనులను నగర పాలక సంస్థ కమిషనర్ ఎం.మల్లయ్యనాయుడు పరిశీలించారు. సర్కిళ్ల వారీగా పనుల తీరును గమనించి, అవసరమైన సలహాలు, సూచనలిచ్చారు. కేఎల్‌పురం, కంటోన్మెంట్, కణపాక తదితర ప్రాంతాల్లో పర్యటించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ ప్రధాన కాలువల్లో వర్షపు నీరు సజావుగా ప్రవహించే విధంగా ఉండాలన్నారు. అవసరమైతే మరింత మంది సిబ్బందిని ఏర్పాటు చేసి, చెత్తాచెదారం తొలగించడం వంటి కార్యక్రమాలు చేపడుతున్నామన్నారు.



కాలువలో పూడికతీత పనులను పరిశీలిస్తున్న కమిషనర్ మల్లయ్యనాయుడు

జీవో-117 రద్దుచేయాలి

బొబ్బిలి: ఐదేళ్లలో పరిష్కారానికి నోచుకోని అనేక విద్యారంగ సమస్యలపై నూతన ప్రభుత్వం చొరవచూపాలని ఏపీటీఎఫ్ నేతలు కోరారు.ఈ మేరకు బుధవారం స్థానిక ఎన్‌జీవో హోంలో ఏపీటీఎఫ్ జిల్లా గౌరవాధ్యక్షుడు బంకురు జోగి నాయుడు అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర ఏపీటీఎఫ్ అకడమిక్ కన్వీనర్ జేసీ రాజు, రాష్ట్ర కార్యవర్గసభ్యురాలు బొత్స పద్మావతి మాట్లాడుతూ విద్యారంగం ఉనికికి పెను ప్రమాదంగా తయారైన 117 జీవోను రద్దు చేసి ప్రాథమిక విద్యను పరిరక్షించాలని, మూతపడిన పాఠశాలలను తెరిపించేందుకు కొత్త ప్రభుత్వం తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. సమావేశంలో ఏపీటీఎఫ్ నాయకులు లక్ష్మణరావు, కె.శ్రీను, ఆర్.రామకృష్ణ, ఎస్.ఎల్లయ్య పాల్గొన్నారు.

వ్యాధులు వ్యాప్తి చెందకుండా చర్యలు

రాజాం: రానున్న వర్షాకాలంలో వ్యాధులు వ్యాప్తి చెందకుండా ముందస్తుగా చర్యలు తీసుకోవాలని ఎంపీడీవో శ్రీనివాసరావు ఆదేశించారు. బుధవారం మండల పరిషత్ కా ర్యాలయంలో పంచాయతీ కార్యద ర్శులతో ఏర్పాటు చేసిన సమావేశం లో ఆయన మాట్లాడుతూ మంచినీటి పథకాలు, ట్యాంకులు 15 రోజులకు ఒక సారి శుభ్రం చేయించాలని కోరారు.



మాట్లాడుతున్న శ్రీనివాసరావు

ఉపాధి పనులకు ఎదురుచూపు

రేగిడి: సంకిలి పంచాయతీలో ఉపాధి వేతనదారులు పనుల కోసం ఎదురు చూస్తున్నారు. ఇక్కడ కొత్త పనులు మంజూరు కాకపో వడంతో గ్రామస్థులు ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లేందుకు సిద్ధమవుతున్నారు. ఇప్పటికేతమ గ్రామపెద్దల ద్వారా ఉపాధి అధికారులకు తెలియజేశారు. కొద్దిరోజుల కిందట వరకు ఎన్నికల కోడ్ వల్ల కొత్త పనులు మంజూరు కాలేదని చెబుతున్నారని, ప్రస్తుతం ఎన్నికల పూర్తి కావడంతో పనులు కల్పించాలని వేతనదారులు అప్ప లమ్మ, శిరిపురపు సరస్వతి, గంటేడ సూర్యనారాయణ, నక్క రామలక్ష్మి తదిత రులు కోరుతున్నారు. అన్ని గ్రామాల్లో ఉపాధి పనులు కల్పించి, ఇక్కడ ఎందుకు కల్పించడంలేదని ప్రశ్నిస్తున్నారు. సంకిలిలో ఎక్కువ మంది కార్మికులు కావడంతో చెరువుల్లో పనులు పూర్తయ్యాయని ఉపాధి ఏపీవో హరినాథ్ తెలిపారు. ఇంకా సాగునీటి చానళ్ల పరిధిలో పనుల మంజూరుకు ప్రతిపాదనలు పంపినా, ఇంకా మంజూరు లేదని చెప్పారు. మంజూరైన వెంటనే ఉపాధి కల్పిస్తామని తెలిపారు.

30 కుటుంబాలు టీడీపీలో చేరిక



కండువా వేసి పార్టీలోకి ఆహ్వానిస్తున్న టీడీపీ నాయకుడు చక్రధర్

నెల్లిమర్ల: మండలంలోని కొత్తపేటలో వైసీపీకి చెందిన 30 కుటుంబాలు టీడీపీలో చేరాయి. బుధవారం కొత్తపేటలో జరిగిన కార్యక్రమంలో పార్టీ మండల కమిటీ అధ్యక్షుడు గురాన చక్రధర్, మాజీ సర్పంచ్ గురాన లక్ష్మి తదితరులు పార్టీ కండువాలను కప్పి ఆహ్వానించారు.

రేపు విద్యుత్ సరఫరాకు అంతరాయం

లక్కవరపుకోట: ఎల్.కోట సబ్ స్టేషన్ పరిధిలో ఖాసాపేట పీడర్ 11కేవీ విద్యుత్ లైన్ మరమ్మతుల వల్ల శుక్రవారం విద్యుత్ సరపరాకు అంతరాయం కలుగుతుందని ఈఈ సురేష్‌బాబు తెలిపారు.జంగిల్‌క్లియరెన్స్ కోసం ఖాసాపేట, కొట్యాడ, తలారి, రంగారాయపురం, సంతపేటకు ఉదయం 8 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు అంతరాయం కలుగుతుందని పేర్కొన్నారు.

40 శాతం వైన్‌షాపులు కేటాయించాలి

విజయనగరం రింగురోడ్డు: కల్లుగీత కార్మికులకు 40 శాతం వైన్‌షాపులు కేటాయించాలని ఏపీ కల్లుగీత కార్మిక సంఘ ప్రతినిధులు జంబల అప్పారావు, గొర్లె సూరిబాబులు డిమాండ్ చేశారు. బుధవారం కేఎల్‌పురంలోని సీఐటీయూ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో వారు మాట్లాడుతూ టీడీపీ ప్రభుత్వం ఏర్పాటు చేయబోయే యాత సాధికారిత కార్పొరేషన్ చైర్మన్ పదవిని జిల్లాకు కేటాయించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో కొలుసు శ్రీను, బంగారునాయుడు, మధుసూధనరావు, అప్పలస్వామి, దేవుడు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సూరిబాబు

పదోన్నతిపై కార్యదర్శి బదిలీ

భోగాపురం: భోగాపురం పంచాయతీలో గ్రేడ్-2 కార్యదర్శిగా విధులు నిర్వహిస్తున్న రాంకృష్ణనాయుడుకు గ్రేడ్-1 గా పదోన్నతి పొందారు. ఈ మేరకు ఆయన విశాఖ జిల్లా ఆనందపురం పంచాయతీకి బదిలీ అయ్యారు. ఆయనను ఎంపీడీవో జి.చంద్రకళ, ఈవోపీఆర్‌డీ సురేష్, కార్యదర్శులు అభినందించారు.

15 నుంచి నీటి సరఫరాకు అంతరాయం

విజయనగరం రింగురోడ్డు: కొర్లాం జంక్షన్ నుంచి గొట్లాం వరకూ నేషనల్ హైవే అథారిటీస్ ఆధ్వర్యంలో రోడ్డు పనులు చేపడుతుండడంతో కంటోన్మెంట్, బాలాజీనగర్, కొత్తఅగ్రహారం, వీటీఈ అగ్రహారం, ఉడా కాలనీలో ఈనెల 15 నుంచి 18 వరకూ నీటి సరఫరాకు అంతరాయం కలుగుతుందని నగర పాలక సంస్థ కమిషనర్ ఎం. మల్లయ్యనాయుడు ఒక ప్రకటనలో తెలిపారు.ఈ మేరకు 37, 38, 39, 40, 41, 43, 44, 46, 47 డివిజన్లలో నీటి సరఫరాకు ఆటంకం కలుతుండడంతో ఆ ప్రాంతాల్లో ప్రత్యామ్నాయ పద్ధతుల్లో ట్యాంకర్ల ద్వారా ఈ నెల 16 నుంచి 17 వరకూ నీటిని సరఫరా చేయనున్నట్లు పేర్కొన్నారు.

రేపు అప్రెంటీస్ ట్రైనీల ఎంపిక

బొబ్బిలి: బొబ్బిలి ప్రభుత్వ ఐటీఐలో శుక్రవారం అప్రెంటీస్ ట్రైనీల భర్తీ కోసం ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్లు ఐటీఐ ప్రిన్సిపాల్ జీవీ రమణారావు ఒక ప్రకటనలో తెలిపారు. హైదరాబాద్‌కు చెందిన మేథో సర్వో కంపెనీలో ఎలక్ట్రీషియన్, ఫిట్టర్, మిషనిస్టు, వెల్డర్ ట్రేడ్స్‌లో సుమారు 200 ఖాళీల భర్తీ కోసం జరగనున్న ఇంటర్వ్యూలకు ఆసక్తి కలిగిన అభ్యర్థులు హాజరు కావచ్చని కోరారు. అభ్యర్థులు ఒరిజినల్ సర్టిఫికెట్లు, ఆధార్ జెరాక్స్, అప్రెంటీస్ రిజిస్ట్రేషన్ ధ్రువీకరణ పత్రం, రెండు ఫోటోలను తీసుకురావాలని రమణారావు తెలిపారు.

జేఏసీగా ఏర్పడి పోరాటం ఉధృతం చేయండి

- సీపీఎం జిల్లా కార్యదర్శి తమ్మినేని సూర్యనారాయణ

కొత్తవలస: జేఎస్‌ఎల్ కర్మాగారంలో ఉన్న కార్మిక సంఘాలు జేఏసీగా ఏర్పడి పోరాటాన్ని ఉధృతం చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి తమ్మినేని సూర్యనారాయణ, సీఐటీయూ జిల్లా నాయకుడు టీవీ రమణ పిలుపునిచ్చారు. ఫెర్రో ఎల్లాయస్ కర్మాగారాలకు సంబంధించి విద్యుత్ చార్జీలను పెంచుతామని ప్రభుత్వం తెలపగానే యాజమాన్యాలంతా ఒక్కటై కర్మాగారాలను మూసేస్తామని అల్టిమేటం ఇచ్చాయని తెలిపారు. బుధవారం జేఎస్‌ఎల్ కర్మాగారం ఎదుట కార్మికులు నిర్వహిస్తున్న నిరసన కార్యక్రమానికి మద్దతు తెలియజేశారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ యాజమాన్యాలకు నష్టం వచ్చే విధంగా నిర్ణయాలు ఉంటే ఒక్కటవుతున్నప్పుడు, ఒక కర్మాగారంలో కార్మికులకు అన్యాయం జరిగినప్పుడు మిగిలిన కర్మాగారాల్లో కార్మికులు ఎందుకు ఒక్కటి కాకూడదని ప్రశ్నించారు. కర్మాగారానికి చెందిన టీఎన్‌టీయూసీ కార్మిక సంఘం అధ్యక్షుడు పిల్లా అప్పలరాజు మాట్లాడుతూ కార్మికులందరికీ లే ఆఫ్ విషయమై గురువారం వరకు యాజమాన్యానికి సమయం ఇచ్చామని, యాజమాన్యం ఎటూ తేల్చక పోతే పోరాటాన్ని ఉధృతం చేస్తామని తెలిపారు. కార్య క్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు గాడి అప్పారావు, జేఎస్‌ఎల్ కర్మాగారానికి చెందిన సీఐటీయూ నాయకుడు నమ్మిచినబాబు, బాలిబోని ఈశ్వరరావు, టీఎన్‌టీయూసీ నాయకులు బూసాల అప్పారావు, సలాది బీమయ్య, వైసీపీ ట్రేడ్ యూనియన్ నాయకుడు లగుడు వామాలు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సూర్యనారాయణ

బాలలతో పనిచేయించడం సామాజిక నేరం

బొబ్బిలి: బాలలకు శారీరక శ్రమ కలిగించే విధంగా పనులు పురమాయించడం, వారిని కార్ఖానాల్లో, ఇతర పనుల్లో నియమించుకోవడం సామాజికనేరమని, చట్టరీత్యా తప్పిదమని రోటరీ క్లబ్ అధ్యక్షుడు జేసీ రాజు తెలిపారు. బుధవారం స్థానిక ప్రభుత్వ ఐటీఐలో విద్యార్థులకు ప్రపంచ బాలకార్మిక వ్యవస్థ నిర్మూలన దినోత్సవాన్ని పురస్కరించుకొని అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కార్య క్రమంలో రోటరీ ప్రెసిడెంట్ ఎలెక్ట్ ఎస్.శ్రీనివాసన్, ఐటీఐ సిబ్బంది సీహెచ్ ప్రసాద్, ఎ.ప్రసాద్ హరికృష్ణ, రామకృష్ణ, శివకాంత్ పాల్గొన్నారు.



సభా వేదిక వద్ద కోలాహలం

చంద్రబాబు అనే నేను..
ప్రభంజనమై మేమూ..






వేదిక ముందు నందమూరి, నారా కుటుంబ సభ్యులతో హీరో రామ్‌చరణ్

కేసరపల్లిలో ఘనంగా టీడీపీ కూటమి మహా పట్టాభిషేకం

ప్రజాతీర్పునకు పట్టాభిషేకమైంది. జనం ప్రభంజనమై పండుగలా కదిలింది. అభిమాన కోలాహలం నడుమ కేసరపల్లి జయకేతనమై ఎగరగా, గన్నవరం జనవరమై జేజేలు పలికింది. 'నారా చంద్రబాబు నాయుడు అను నేను..' అనే మాటతో అభిమాన సంబరాలు అంబరాన్నంటాయి. కేసరపల్లిలో బుధవారం ఉదయం జరిగిన టీడీపీ కూటమి ప్రమాణస్వీకార మహోత్సవానికి అతిరథ మహారథులు హాజరయ్యారు. ప్రధానమంత్రి నరేంద్రమోదీ, సినీ ప్రముఖులు రజనీకాంత్, చిరంజీవి ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. - విజయవాడ, ఆంధ్రజ్యోతి

బస్సెక్కిన అభిమానం









చంద్రబాబు ప్రమాణస్వీకారం చేస్తుండగా నందమూరి రామకృష్ణ భావోద్వేగం, బాలకృష్ణ, భువనేశ్వరి అనురాగం, సభావేదిక వద్ద నాగలితో ఓ రైతు



వేదికపై బాలకృష్ణ, రజనీకాంత్ దంపతులు, చిరంజీవి



జనసేన, టీడీపీ, బీజేపీ స్టిక్కరింగ్ స్కూటర్లపై వినూత్నంగా..

అక్కడ ప్రమాణం.. ఇక్కడ వీక్షణం

- చంద్రబాబు ప్రమాణస్వీకారాన్ని తిలకించిన ప్రజలు
- ఎల్‌ఈడీ స్క్రీన్‌లు ఏర్పాటు చేసిన టీడీపీ నాయకులు
- కేరింతలు కొడుతూ, సంబరాలు చేసుకున్న పార్టీ శ్రేణులు



జామిలో బిగ్‌స్క్రీన్‌పై తిలకిస్తున్న ప్రజలు



రాజాం: కార్యక్రమాన్ని తిలకిస్తున్న మహిళలు



గంట్యాడలో బాణసంచా పేల్చుతున్న దృశ్యం





రామభద్రపురంలో..



మంత్రిని కలిసిన జామి టీడీపీ మండల పార్టీ అధ్యక్షుడు

విజయనగరం (ఆంధ్రజ్యోతి): చంద్రబాబు, మంత్రి వర్గ సహచరుల ప్రమాణస్వీకారాన్ని జిల్లా ప్రజలు ఉత్సాహంగా వీక్షించారు. టీవీలు, సెల్‌ఫోన్లతో పాటు బిగ్‌స్క్రీన్‌లపై తిలకించి సందడి చేశారు. అధికారులు కూడా ఎల్‌ఈడీ స్క్రీన్లు ఏర్పాటు చేశారు. ప్రమాణ స్వీకార కార్యక్రమాన్ని ఉదయం 10 గంటల నుంచి నిర్వహించారు. కలెక్టరేట్‌తో పాటు విజయనగరంలోని ఎన్‌సీఎస్ థియేటర్, ఆనందగజపతిరాజు కళాక్షేత్రం తదితర ప్రాంతాల్లో భారీ స్క్రీన్లు ఏర్పాటు చేశారు. చంద్రబాబు, పవన్‌కల్యాణ్ ప్రమాణస్వీకారం చేస్తున్నప్పుడు ఈలలు, కేకలతో కేరింతలు కొట్టారు. ఉమ్మడి జిల్లా పరిధిలో గుమ్మిడి సంధ్యారాణి, కొండపల్లి శ్రీనివాస్‌లు మంత్రులుగా ప్రమాణస్వీకారం చేశారు. ● **జామి:** కూటమి ప్రభుత్వ ప్రమాణాస్వీకార కార్యక్రమం చూసేందుకు జామి మండలంలో బిగ్‌స్క్రీన్ టీడీపీ నేతలు ఏర్పాటు చేయించారు. ● **రాజాం:** టీడీపీ ప్రమాణ సీకార కార్యక్రమాన్ని పురపాలక సంఘం పరిధిలోని మహిళా సంఘాల సభ్యులు తిలకించారు. పురపాలక సంఘం కమీషనర్ రామప్పలనాయుడు ఆదేశాలతో పురపాలక సంఘం పరిధిలోని మహిళా సంఘాల ప్రతినిధులు, సభ్యులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. ● **జామి:** కూటమి ప్రభుత్వంలో మంత్రిగా ప్రమాణాస్వీకారం చేసిన గజపతినగరం ఎమ్మెల్యే కొండపల్లి శ్రీనివాస్‌ను టీడీపీ మండల పార్టీ అధ్యక్షుడు స్వామినాయుడు ఆధ్వర్యంలో పలువురు నాయకులు, కార్యకర్తలు కలిసి అభినందనలు తెలిపారు. ● **శృంగవరపుకోట:** మంత్రిగా ప్రమాణస్వీకారంచేసిన ఎమ్మెల్యే కొండపల్లి శ్రీనువాస్‌కు శృంగవరపుకోట జనసేన నాయకుడు ఒబ్బిన సన్యాసినాయుడు తదితరులు అభినందనలు తెలిపారు. ● **గజపతినగరం:** కొండపల్లి శ్రీనివాస్‌కు నియోజకవర్గా నికి చెందిన మూడు పార్టీల శ్రేణులు శుభాకాంక్షలు తెలిపారు. జనసేన పార్టీ పీఏసీ సభ్యురాలు పడాల అరుణ, నియోజకవర్గ ఇన్‌చార్జి మర్రాపు సురేష్ విజయవాడలో మంత్రికి శాలువ కప్పి సత్కరించారు. ప్రమాణ స్వీకారాన్ని గజపతినగరంలో లక్ష్మీ నారాయణ ఫంక్షన్ హాల్‌లో ప్రత్యేక స్క్రీన్‌పై చూశారు. ● **గంట్యాడ:** ఎమ్మెల్యే కొండపల్లి శ్రీనివాస్‌కు మంత్రి పదవి రావడంతో ఆయన స్వగ్రామం గంట్యాడలో స్థానికులు సంబరాలు చేసుకున్నారు. ఎల్లమాంబ ఆలయం వద్ద గ్రామానికి చెందిన సీర ఈశ్వరరావు 101 కొబ్బరికాయలు కొట్టి మొక్కులు తీర్చుకున్నారు. శ్రీనివాస్ స్వగృహం వద్ద బాణసంచా కాల్చారు. **రామభద్రపురం:** బూసాయవలసలోని ప్రైవే టు ఫంక్షన్ హాలులో భారీ ఎల్‌ఈడీ స్క్రీన్‌ను ఎంపీడీవో ఈశ్వరమ్మ ఆధ్వ ర్యంలో ఏర్పాటు చేశారు. అన్నిశాఖల అధికారులతో పాటు ప్రజలు అధిక సంఖ్యలో తరలివచ్చి తిలకించారు. ఎంఈవో తిరుమలప్రసాద్, ఈవోపీ ఆర్‌డీ వెంకట రమణ, సీనియర్ అసిస్టెంట్ చొక్కాపు శ్రీరాములునాయుడు తదితరులు పాల్గొన్నారు. ● **శృంగవరపుకోట:** శృంగవరపుకోట శ్రీధారగంగమ్మ కల్యా ణ మండపంలో బుధవారం నారా చంద్రబాబునాయుడు ముఖ్య మంత్రిగా చేసిన ప్రమాణ స్వీకారాన్ని ప్రజలు తిలకించారు. దీన్ని చూసేందుకు పెద్ద స్క్రీన్‌ను ఏర్పాటు చేశారు. ● **బొబ్బిలి:** రాష్ట్ర ముఖ్యమంత్రిగా నారా చంద్రబాబునాయుడు ప్రమాణ స్వీకారం చేసిన సమయంలో బొబ్బిలి కోటలో తెలుగు మహిళలు బుధవారం పెద్ద ఎత్తున సంబరాలు జరుపుకున్నారు. మున్సిపల్ టీడీపీ ఫ్లోర్‌లీడర్, ఆరో వార్డు కౌన్సిలరు గెంబలి శ్రీనివాసరావు, టీడీపీ కౌన్సిలర్లు, తెలుగు మహిళా నాయకురాళ్లు వెలగాడ హైమావతి, కింతలి శ్రీదేవి, బీసపు పార్వతి, కళ్యంపూడి లక్ష్మి, గోనా మానస తదితరుల ఆధ్వర్యంలో కేక్ కట్ చేశారు.



బొబ్బిలి కోట వద్ద..



ఎస్.కోటలో..

ప్రమాణ స్వీకారానికి ప్రతిభ, గ్రీష్మా



రాజాం: చంద్రబాబునాయుడు ముఖ్య మంత్రిగా ప్రమాణ స్వీకార కార్యక్రమానికి బుధవా రం మాజీ స్పీకర్ కావలి ప్రతిభా భారతి, కావలి గ్రీష్మా హాజరయ్యారు. చంద్రబాబు వారిద్దరినీ స్వయంగా ఆహ్వానించడంతో కలిసి హాజరయ్యారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి

సీతంపేట: మండలంలోని మల్లి గ్రామానికి చెందిన బిడ్డిక దినేష్(19) గ్రామంలో సప్లయర్స్ షాపు నిర్వహిస్తున్నాడు. ఈ క్రమంలో మంగళవారం మధ్యాహ్నం పనిలో భాగంగా వ్యాన్‌పై సప్లయర్స్ సామగ్రితో పాటు వెళ్తుండగా వ్యాన్ పైనుంచి జారిడ్డాడు. ఈ ప్రమాదంలో తలకు తీవ్రగాయాలు తగలడంతో స్థానికులు, కుటుంబ సభ్యులు శ్రీకాకుళంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ బుధవారం ఉదయం మృతి చెందాడు. దీనితో మల్లి గ్రామంలో విషాదఛాయలు అలముకున్నాయి. మృతుడికి తండ్రి బిడ్డిక శ్రీనివాసరావు ఉన్నారు.

రైలు ఢీకొని గుర్తుతెలియని వ్యక్తి మృతి

బొబ్బిలి: బొబ్బిలి- డొంకినవలస రైల్వే ట్రాక్‌లో ఫ్లైఓవర్ సమీపంలో గుర్తు తెలియని యువకుని మృతదేహం పడి ఉంది. విజయనగరం రైల్వే ఎస్‌ఐ రవి వర్మ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. సుమారు 35 ఏళ్ల వయస్సు కలిగిన వ్యక్తి రైలు నుంచి జారిపడడం లేదా, రైలుఢీకొనడంతో పట్టాల సమీపంలో మృతి చెందాడని తెలిపారు. నలుపురంగు ఫ్యాంట్ ధరించి ఉన్నాడని, ఇంకెటువంటి ఆధారాలు అతని వద్ద లభ్యం కాలేదన్నారు. మంగళవారం ఈ ప్రమాదం జరిగి ఉంటుందని భావిస్తున్నారు. మృతునికి సంబంధించిన సమాచారం ఏదైనా ఉంటే తనకు (9490617089 లేదా బొబ్బిలి రైల్వే పోస్టు ఇన్‌చార్జి బండారు ఈశ్వరరావు (9491813163 నెంబరుకు సమాచారం అందజేయాలని ఎస్‌ఐ రవి వర్మ తెలిపారు. మృతదేహాన్ని విజయనగరం ప్రభుత్వ ఆసుపత్రి మార్చురీలో భద్రపరిచినట్లు తెలిపారు.

ఆంధ్రప్రదేశ్ అన్ని రంగాల్లో అభివృద్ధి చెందాలి

విజయనగరం రూరల్: ఆంధ్రప్రదేశ్ అన్ని రంగాల్లో అభివృద్ధి చెందాలని ఆకాంక్షిస్తున్నట్టు ఎస్టీ కమిషన్ ఛైర్మన్ డాక్టర్ డీవీజీ శంకరరావు ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు, ఆయన మంత్రివర్గ సహచరులకు ఆయన శుభాకాంక్షలు తెలిపారు. ప్రజలందరికీ సంక్షేమం, సాధికారిత కల్పించే దిశగా ముందడుగు వేయాలని కోరారు. ఆదివాసీల పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించి, వారి జీవితాల్లో వెలుగులు నింపాలని ఆకాంక్షించారు.

ఎన్నికల సిబ్బందికి
ధ్రువ పత్రాలు మంజూరు చేయాలి

కలెక్టరేట్, జూన్ 12: జిల్లాలోని ఎన్నికల నిర్వహించే సిబ్బందికి ధ్రుపత్రాలను వెంటనే మంజూరు చేయాలని ఏపీటీఎఫ్(1938) నాయకులు కోరారు. బుధవారం డీఆర్‌వో అనితకు వినతి పత్రం సమర్పించారు. హోం ఓటింగ్ విధులు నిర్వహించేవారి డ్యూటీ సర్టిఫికెట్లు అందజేయాలని కోరారు.



వినతి పత్రం ఇస్తున్న దృశ్యం

ఘనంగా అవనాపు విజయ్ పుట్టిన రోజు

దాసన్నపేట: టీడీపీ నగర నాయకులు, యువనేత అవనాపు విజయ్ పుట్టినరోజు వేడుకలు బుధవారం, కుటుంబ సభ్యులు, అభిమానుల మధ్య తన స్వగృహంలో ఘనంగా జరిగాయి. నగరంలోని ప్రేమ సమాజం, ఏటీసీ వృద్ధాశ్రమంలో తల్లి చిన్నమ్మలు, భార్య భార్గవి, పిల్లా విజయ్‌కుమార్‌తో కలసి వృద్ధులకు పండ్లు, ఆహారాన్ని అందించారు. విజయ్ అభిమానులు ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరానికి భారీగా యువకులు రక్తదానం చేశారు. ఏటా తనపుట్టిన రోజువేడుకలను వృద్ధులు, అభిమానుల మధ్య జరుపుకోవటం ఆనందంగా ఉందని విజయ్ అన్నారు. ముఖ్యమంత్రిగా నారా చంద్రబాబునాయుడు ప్రమాణ స్వీకారం రోజునే పుట్టిన రోజు వేడుకలు జరుపుకోవటం ఎంతో ఆనందంగా ఉందన్నారు. రౌతు చంటి, గాడు అప్పారావు, హంసశ్రీను, తదితరులు పాల్గొన్నారు.



అభిమానులు, కుటుంబ సభ్యుల మధ్య అవనాపు విజయ్ పుట్టినరోజు వేడుకలు

బొల్లినేని మెడ్‌స్కిల్స్ విద్యార్థినికి బ్రిటన్‌లో కొలువు

- ఏడాదికి రూ.37 లక్షలు వేతనం

శ్రీకాకుళం రూరల్: బొల్లినేని మెడ్‌స్కిల్స్‌కు చెందిన పారామెడికల్ విద్యార్థినికి బ్రిటన్‌లో కొలువు లభించింది. గుంటూరు జిల్లా తెనాలికి చెందిన నన్నం నిస్సీ లియోన్ రాగోలు జెమ్స్ ఆసుపత్రి ప్రాంగణంలో ఉన్న 'బొల్లినేని మెడ్‌స్కిల్స్'లో బీఎస్సీ కార్డియాలజీ పూర్తి చేసింది. అనంతరం ఇంటర్న్‌షిప్ కోసం సికింద్రాబాద్‌లో కిమ్స్ హాస్పిటల్‌లో చేరి అక్కడ శిక్షణ పొందుతూనే ఇంగ్లిషులో నైపుణ్య శిక్షణను తీసుకుంది. బ్రిటన్‌లో నేషనల్ హెల్త్ సర్వీస్‌కు చెందిన ప్రముఖ ఆసుపత్రిలో ఉద్యోగిగా నిస్సీ ఎంపికైంది. ఏడాదికి రూ.37 లక్షల వేతనం ఆమెకు లభించనుంది. మొట్ట మొదటిసారిగా బీఎస్సీ నుంచి పారామెడికల్ విద్యార్థిని ఇంత ఘనతను సాధించినందుకు ఆమెను జెమ్స్ మెడికల్ కాలేజీ చీఫ్ మెంటార్ డాక్టర్ బొల్లినేని భాస్కరరావు అభినందించారు. సంకల్పం, నైపుణ్యం ఉంటే విజయం రుజువైందన్నారు. బొల్లినేని మెడ్‌స్కిల్స్ సంస్థ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ నాగేశ్వరరావు అభినందించారు.



విద్యార్థినిని అభినందిస్తున్న చీఫ్ మెంటార్ బొల్లినేని భాస్కరరావు

ఎట్టకేలకు బోర్ల మరమ్మతు

బొబ్బిలి, జూన్ 12: బొబ్బిలి మున్సిపల్ పరిధిలోని ఇందిరమ్మకాలనీలో ఎట్టకేలకు బోరు బావులు మరమ్మతుకు నోచుకున్నాయి. ఈ కాలనీలో సుమారు రెండు నెలల నుంచి బోరు బావులు మరమ్మతుకు గురికావడంతో తాగు నీటికి కటకటలాడుతున్నామని కాలనీవాసులంతా గగ్గోలు పెట్టారు. నాయకులకు, అధికారులకు, మున్సిపల్ సిబ్బందికి తాగునీటి సమస్యపై చెప్పి చెప్పి విసిగిపోయారు. అయినా ఎవరూ స్పందించలేదు. బోర్ల మరమ్మతులకు అవసరమైన మెటీరియల్ లేదని కుంటిసాకులు చెప్పి తప్పించుకునేవారు. ప్రతి మున్సిపల్ కౌన్సిల్ సమావేశంలో తాగునీటి సరఫరా నిర్వహణ కోసం, బోర్ల కోసం లక్షలాది రూపాయలను కేటాయిస్తూ తీర్మానాలు చేసేవారు. ఆ నిధులన్నీ ఎటు పోతున్నాయో అర్థం కావడం లేదని స్థానికులు తీవ్ర విమర్శలు గుప్పించారు. వేసవిలో తాగునీటి ఎద్దడిని నివారించకుండా సమస్యను మరింత జటిలం చేయడంపై ఆక్షేపణ వ్యక్తం చేశారు.

బాలకార్మిక వ్యవస్థను అంతం చేద్దాం

విజయనగరం రింగురోడ్డు, జూన్ 12: ది లెప్రసీ మిషన్, హీల్ ప్రాజెక్టు సంయుక్త నిర్వహణలో చెల్లూరు గ్రామంలో అంతర్జాతీయ బాల కార్మిక వ్యతిరేక దినోత్సవం సందర్భంగా అవగాహన కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రాజెక్టు ప్రతినిధి తాలాడ దీప్తి మాట్లాడుతూ బాలలను పనిలో పెట్టుకోవడం నేరమన్నారు. బాల కార్మిక వ్యవస్థ నిర్మూలన కోసం అనేక చైతన్య కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్టు తెలిపా రు. పిల్లలు పనికి పోకుండా బడిలో చేరేలా తల్లిదండ్రులు సహకరించాల న్నారు. గ్రామీణ ప్రాంతాల్లో బాల కార్మిక వ్యవస్థ నిర్మూలన కోసం ప్రతి ఒక్క రూ కృషి చేయాలన్నారు. సీడీవో, ఎం.వంశీ, విద్యార్థులు పాల్గొన్నారు.



ప్లకార్డులు ప్రదర్శిస్తున్న విద్యార్థులు